www.siddipetpower.com

# సిద్దిపేట పవర్

తెలుగు దినపత్రిక

SIDDIPET POWER TELUGU DAILY

సంపుటి: 01 | సంచిక: 161 | హైదరాబాద్ | శుక్రవారం 29-08-2025 | పేజీలు: 05 | ఎడిటర్ : తుక్కోజు గణేష్ బాబు

## 'స్వతంత్ర ఎమ్మెల్యేగా అసెంబ్లీకి వెళ్తా'..

**హైదరాబాద్ ఆగస్టు 29 (సిద్దిపేట పవర్):**

తెలంగాణ బీజేపీఅధిష్టానంపై గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్మరోసారి హాట్ కామెంట్స్ చేశారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. తెలంగాణలో బీజేపీ భ్రష్టు పట్టిందని అన్నారు. కొందరు నేతల వల్ల పార్టీకి తీవ్రంగా నష్టం జరుగుతోందని ఆరోపించారు. తాను స్వతంత్ర ఎమ్మెల్యేగా అసెంబ్లీకి వెళ్తా అని కీలక ప్రకటన చేశారు. ఇప్పుడు నాకు ఎవరూ బాస్‌లు లేరు, నన్ను ఎవరూ కట్టడి చేయలేరు, అసెంబ్లీలో స్వేచ్ఛగా మాట్లాడే అవకాశం వచ్చిందని అన్నారు. తనకు తాను మళ్లీ బీజేపీలో చేరను.. పార్టీ జాతీయ నాయకత్వం పిలిస్తేనే మళ్లీ పార్టీలో చేరుతా అని స్పష్టం చేశారు.



కాగా, శనివారం నుంచి తెలంగాణ శాసనసభ, శాసనమండలి సమావేశాలు ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో నిర్వాహణ, వసతులు, భద్రతా ఏర్పాట్లపై రాష్ట్రప్రభుత్వ ఉన్నతాధికారులు, పోలీసు శాఖ ఉన్నతాధికారులతో కలిసి స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాష్ ముదిరాజ్ పరిశీలించారు.

## జూబ్లీహిల్స్ ఉప ఎన్నికపై బీజేపీ వ్యూహం..

**ఐదుగురితో ప్రత్యేక మానిటరింగ్ కమిటీ**
**మాగంటి గోపినాథ్ మరణంతో**
**జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక తప్పనిసరి**
**బీజేపీ వ్యూహాత్మకంగా**
**ఐదుగురి మానిటరింగ్ కమిటీ ఏర్పాటు**
**కమిటీలో కీలక నేతలకు బాధ్యతలు**
**జూబ్లీహిల్స్ ఫలితం**
**హైదరాబాద్ రాజకీయాలపై ప్రభావం**

**హైదరాబాద్ ఆగస్టు 29 (సిద్దిపేట పవర్):**

హైదరాబాద్‌లోని ప్రతిష్టాత్మకమైన జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గంలో త్వరలో ఉప ఎన్నిక జరగనుంది. ఇటీవల బీఆర్ఎస్ ఎమ్మెల్యే మాగంటి గోపినాథ్ ఆరోగ్య సమస్యల కారణంగా మృతి చెందడంతో ఈ ఖాళీ ఏర్పడింది. ఈ నేపథ్యంలో జూబ్లీహిల్స్‌లో ఉప ఎన్నిక అనివార్యమైంది. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని భావించిన తెలంగాణ బీజేపీ, స్థానాన్ని కైవసం చేసుకునేందుకు ప్రత్యేక వ్యూహాలు రచిస్తోంది. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికను ప్రాధాన్యంగా తీసుకున్న రాష్ట్ర బీజేపీ, ఈ ఎన్నికను సమర్థంగా సమన్వయం చేసేందుకు ఉప ఎన్నిక మానిటరింగ్ కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీని రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావు ప్రకటించారు. పార్టీ అభ్యర్థి ఎంపిక నుండి, బూత్ స్థాయి కార్యకలాపాల వరకు ఎన్నికల వ్యూహాలను సమన్వయం చేయడం, స్థానిక సమస్యలను సేకరించడం, ప్రచారాన్ని సమర్థవంతంగా నడిపించడం వంటి బాధ్యతలను ఈ కమిటీ చేపట్టనుంది.

ఎమ్మెల్యే పాయల్ శంకర్, ఎంపీ ఎం. రఘునందన్ రావు, మాజీ ఎంపీ గరికపాటి మోహన్ రావు, మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, హైదరాబాద్ సెంట్రల్ జిల్లా మాజీ అధ్యక్షుడు డాక్టర్ గౌతమ్ రావులతో ఈ కమిటీ ఏర్పాటు చేశారు. ఈ కమిటీ ద్వారా జూబ్లీహిల్స్ ప్రాంతంలో బీజేపీ బలాన్ని పెంచడం, స్థానిక ప్రజల సమస్యలను పార్టీ వైఖరితో అనుసంధానం చేయడం, బూత్ స్థాయి నాయకత్వం నుండి పై స్థాయి సమన్వయం వరకూ కచ్చితమైన పర్యవేక్షణ కొనసాగించనుంది. హైదరాబాద్ నగరంలోనే కాకుండా తెలంగాణ రాజకీయాల్లోనూ జూబ్లీహిల్స్ నియోజకవర్గానికి ప్రత్యేక ప్రాధాన్యం ఉంది. విద్యావంతుల ప్రాంతం కావడంతో పాటు వ్యాపారవేత్తలు, ఐటీ ప్రొఫెషనల్స్, మధ్యతరగతి ఓటర్ల ఆధిపత్యం ఉన్న ఈ ప్రాంతంలో ఎన్నికలు ఎప్పుడూ కఠినంగానే జరుగుతాయి. గతంలో కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్—all మూడూ ఈ నియోజకవర్గంలో తమ ప్రాతినిధ్యం కోసం పోరాడిన ఉదాహరణలు ఉన్నాయి.

ప్రస్తుతం ఉప ఎన్నిక నేపథ్యంలో, బీజేపీకి ఇది ఒక అవకాశం. 2028 ఎన్నికల దిశగా హైదరాబాద్‌లో తన పట్టు పెంచుకోవాలని ఆశిస్తున్న బీజేపీ, జూబ్లీహిల్స్ ఉప ఎన్నికను ప్రతిష్టాత్మకంగా తీసుకోవడం వెనుక కారణం అదే అని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. జూబ్లీహిల్స్‌లో బీజేపీకి శక్తివంతమైన క్యాడర్ ఉన్నప్పటికీ, బీఆర్ఎస్ స్థానిక స్థాయిలో బలంగా ఉండటం, కాంగ్రెస్ కూడా మళ్లీ ఈ సీటు కోసం యాక్టివ్ అవ్వడం, ఎన్నికను త్రిముఖ పోరుగా మార్చే అవకాశం ఉందని భావిస్తున్నారు. అంతేకాకుండా, మైనారిటీ ఓటర్ల ప్రాధాన్యం కూడా ఫలితాలపై ప్రభావం చూపే అంశంగా ఉంది. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికను గెలుచుకోవడానికి బీజేపీ సమగ్రమైన వ్యూహంతో ముందుకు వెళ్తోంది. రాష్ట్ర అధ్యక్షుడు ఏర్పాటు చేసిన ఐదుగురి కమిటీ ఈ వ్యూహానికి మద్దతుగా పనిచేయనుంది.



ఈ ఉప ఎన్నికలో బీజేపీ గెలిస్తే, అది హైదరాబాద్ రాజకీయ సమీకరణాలపై గణనీయమైన ప్రభావం చూపనుంది.

## జీఎస్టీ రేషనలైజేషన్ వల్ల రాష్ట్రాలకు భారీ నష్టం

**జీఎస్టీ రేషనలైజేషన్ వల్ల రాష్ట్రాలకు భారీ నష్టం.. భట్టి హెచ్చరిక**
**తెలంగాణకే రూ.7 వేల కోట్ల వరకు ఆదాయం కోత**
**14%వృద్ధి హామీ విఫలం – కేవలం 7%గ్రోత్ మాత్రమే**
**సెప్టెంబర్ 3 జీఎస్టీ కౌన్సిల్‌లో రాష్ట్రాల ఏకగ్రీవ డిమాండ్లు**

**ఢిల్లీ ఆగస్టు 29 (సిద్దిపేట పవర్):**

ఢిల్లీ లో జరిగిన సమావేశంలో జీఎస్టీ రేషనలైజేషన్ అంశంపై సుదీర్ఘంగా చర్చ జరిగింది. ఈ సమావేశానికి ఎనిమిది రాష్ట్రాల మంత్రులు హాజరయ్యారు. ఇందులో తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మాట్లాడుతూ, రేట్ రేషనలైజేషన్ పేరుతో రాష్ట్రాలకు భారీ రెవెన్యూ నష్టం సంభవించే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఆయన తెలిపారు, "అన్ని రాష్ట్రాల ఆర్థిక పరిస్థితులు బాగుంటేనే దేశం బాగుంటుంది. కేంద్రం ఫెడరల్ స్ఫూర్తితో వ్యవహరించాలి. రేషనలైజేషన్‌ను మేము ఆహ్వానిస్తున్నాం కానీ, రాష్ట్రాలకు జరిగే నష్టానికి తగిన నష్టపరిహారం చెల్లించే మార్గాలను కేంద్రం ఆలోచించాలి" అని స్పష్టం చేశారు.

జీఎస్టీ ద్వారా రాష్ట్రాలకు వచ్చే ఆదాయంపై ఎన్నో ప్రణాళికలు ఆధారపడి ఉంటాయని భట్టి గుర్తుచేశారు. ముఖ్యంగా సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు, మౌలిక సదుపాయాలపై తీవ్ర ప్రభావం చూపుతుందని చెప్పారు. తెలంగాణకే సుమారు 7 వేల కోట్ల రూపాయల నష్టం తలెత్తే అవకాశం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. జీఎస్టీని అమలు చేసే సమయంలో కేంద్రం రాష్ట్రాలకు కనీసం 14 శాతం వృద్ధి హామీ ఇస్తామని చెప్పినా, వాస్తవానికి ఇప్పటికీ 7 శాతం మాత్రమే వృద్ధి వస్తోందని భట్టి పేర్కొన్నారు.

ఈ నేపథ్యంలో రాష్ట్రాలకు తగిన నష్టపరిహారం చెల్లించాలని, సెస్ రూపంలో వచ్చే ఆదాయాన్ని రాష్ట్రాలకే ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో పాల్గొన్న ఎనిమిది రాష్ట్రాలు ఏకగ్రీవంగా కేంద్రం చర్యలు తీసుకోవాలని నిర్ణయించాయి. సెప్టెంబర్ 3న జరగనున్న జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలో ఈ డిమాండ్లను లేవనెత్తాలని నిర్ణయించారు. అలాగే, అదే రోజు మళ్లీ ఆర్థిక మంత్రుల సమావేశం ఢిల్లీలో జరగనుంది.




# మిత్తి చారాణా.. బద్నాం బారాణా..

## కాంగ్రెస్ తప్పుడు ప్రచారం పటాపంచలు

**రుణాలకు చెల్లిస్తున్న వడ్డీపై**
**ఇన్నాళ్లు రేవంత్‌రెడ్డి అసత్యాలు**
**నెలకు 6,500 కోట్లంటూ అబద్ధం..**
**కట్టేది 2,338 కోట్లే**
**'కాగ్'కు సర్కారు ఇచ్చిన**
**గణాంకాలే అందుకు సాక్ష్యం**
**కాంగ్రెస్ పాలనలో తీవ్ర**
**అనిశ్చితిలోకి తెలంగాణ ఆర్థికం**
**బడ్జెట్ రాబడి అంచనాల్లో**
**4 నెలల్లో వచ్చింది 21 శాతమే**
**వార్షిక అంచనాల్లో ఇప్పటికే**
**45 శాతం దాటిన అప్పు**

**హైదరాబాద్ ఆగస్టు 29 (సిద్దిపేట పవర్):**

బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అప్పులకు నెలకు రూ.6,500 కోట్ల వడ్డీ కడుతున్నామని సీఎం రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ఇతర కాంగ్రెస్ నేతలు ప్రచారం చేస్తున్నది దుష్ప్రచారం అని మరోసారి తేలింది. కాగ్ నివేదిక ప్రకారం గత నాలుగు నెలల్లో ప్రభుత్వం సగటున నెలకు రూ.2,338 కోట్లు మాత్రమే వడ్డీ చెల్లించింది. ఈ విషయం స్వయంగా కాంగ్రెస్ సర్కారే వెల్లడించింది. ఆర్థిక సంవత్సరం తొలి నాలుగు నెలలకు సంబంధించి కాగ్‌కు సమర్పించిన గణాంకాల్లో ఈ విషయం స్పష్టమైంది.

మరోవైపు కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాదిన్నర దాటిపోయినా ఆర్థిక అనిశ్చితి మాత్రం కొనసాగుతూనే ఉన్నది. రాష్ట్ర ఆదాయం క్రమంగా తగ్గిపోతుండగా, ప్రభుత్వం రికార్డు స్థాయిలో అప్పులు చేస్తూ ప్రజల నెత్తిన భారం పెంచుతున్నది. ప్రభుత్వం తాజాగా కాగ్‌కు సమర్పించిన జూలై నివేదికే ఇందుకు సాక్ష్యం. ఈ నివేదిక ప్రకారం ఈ ఏడాది ఏప్రిల్ నుంచి జూలై వరకు రాష్ట్ర ఖజానాకు రెవెన్యూ రాబడులు రూ.50,270 కోట్లు సమకూరాయి. ప్రభుత్వం ప్రతిపాదించిన 202526 ఆర్థిక సంవత్సర బడ్జెట్‌లో రెవెన్యూ రాబడులు రూ.2.29 లక్షల కోట్లుగా అంచనా వేసింది.

మూడింట ఒకవంతు ఆర్థిక సంవత్సరం ముగిసే నాటికి రాబడులు 21 శాతానికే పరిమితం అయ్యింది. ఇదే సమయంలో రాష్ట్ర అప్పులు మాత్రం పెరిగిపోతున్నాయి. బడ్జెట్‌లో ఈ ఏడాది కాలంలో రూ.54,009 కోట్లు రుణాలు సేకరిస్తామని చెప్పగా, నాలుగు నెలల్లోనే 45 శాతం రుణాలు సమీకరించింది. గత ఐదేండ్లలో జూలైనాటికి సమీకరించిన అత్యధిక మారెట్ రుణం ఇదే కావడం ఆందోళన కలిగిస్తున్నది. ఆదాయం తగ్గిపోవడంతో దీని ప్రభావం మూలధన వ్యయంపై పడిం ది. ఈ ఏడాది బడ్జెట్‌లో పెట్టుబడి వ్యయం రూ.36,504.45 కోట్లుగా ప్రతిపాదించారు. జూలై వరకు రూ.5,988.27 కోట్లు మాత్రమే ఖర్చు చేశారు. అంటే అంచనాలో ఇది 16.40 శాతం మాత్రమే.

**పన్ను వసూళ్లలో తగ్గుదల**

సొంత ఆదాయ రాబడులుగా భావించే ట్యాక్స్ రెవెన్యూ (జీఎస్టీ, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్లు, ల్యాండ్ రెవెన్యూ, సేల్స్ ట్యాక్స్, స్టేట్ ఎక్సైజ్ సుంకాలు) ఈ నాలుగు నెలల్లో పెరుగకపోగా, తగ్గుదల నమోదైంది. ఆర్థిక సంవత్సరంలో 33 శాతం సమయం గడిచిపోగా.. ట్యాక్స్ రెవెన్యూ సగటున 23 శాతమే నమోదైంది. కీలకమైన స్టాంపులు, రిజిస్ట్రేషన్లు, సేల్స్ ట్యాక్స్ వంటివి తగ్గడం ఆందోళన కలిగిస్తున్నది. రాష్ట్రం ఈ ఆర్థిక సంవత్సరానికి రూ.2,738 కోట్ల ఆదాయ మిగులుగా బడ్జెట్‌లో అంచనా వేసింది. కానీ జూలై వరకు రూ.12,564 కోట్ల ఆదాయ రెవెన్యూ లోటు నమోదైంది. ఆర్థిక లోటు రూ.24,669 కోట్లుగా ఉన్నది. సొంత రాబడులతోపాటు పన్నేతర ఆదాయాలు, కేంద్ర గ్రాంట్లు గణనీయంగా మెరుగుపడకపోతే, పెరుగుతున్న ఖర్చులు, సంక్షేమ పథకాల అమలు కష్టతరమేనని ఆర్థిక నిపుణులు హెచ్చరిస్తున్నారు.





**మిత్తీ లెక్కలు తప్పు**

రాష్ట్ర అప్పులు, మిత్తీలపై ప్రభుత్వ పెద్దలు చెప్తున్నది తప్పుడు లెక్కలని కాగ్ నివేదిక నిరూపించింది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అప్పులకు నెలకు రూ.6,500 కోట్ల వడ్డీ కడుతున్నామని సీఎం, డిప్యూటీ సీఎం, మంత్రులు, కాంగ్రెస్ నేతలు ప్రచారం చేస్తున్నారు. కానీ కాగ్ గణాంకాలను విశ్లేషిస్తే కనీసం ఆ దరిదాపుల్లో కూడా లేదని స్పష్టం అవుతుంది. కాగ్ నివేదిక ప్రకారం గత నాలుగు నెలల్లో ప్రభుత్వం చెల్లించిన వడ్డీ రూ.9,355 కోట్లు మాత్రమే. నెలకు రూ.2,338 కోట్లు చెల్లిస్తున్నది. అంటే ప్రభుత్వం చెప్తున్నదాంట్లో సగం కూడా కట్టడం లేదన్నమాట.

## 18 వేల టన్నుల యూరియా వస్తోంది

**హైదరాబాద్ ఆగస్టు 29 (సిద్దిపేట పవర్):**

రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి మేరకు ఎల్లుండి నాటికి 18 వేల టన్నుల యూరియా వస్తుందని రాష్ట్ర వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు గురువారం ఎరువులు, భారీ వర్షాలపై సచివాలయంలో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. వారం రోజుల్లో మరో 21 వేల టన్నులు వస్తుందని, సెప్టెంబరు మాసంలో అదనపు సరఫరా కోసం చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. వ్యవసాయ శాఖ పరిధిలోని శాఖలతో పాటు కార్పొరేషన్‌ల పరిధిలోని ఉద్యోగుల్లో పలువురు ఆలస్యంగా రావడంపై వివరణ కోరుతూ..శుక్రవారం ఎవరైనా ఆలస్యంగా వస్తే వారిపై శాఖా పరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.



## కళ్యాణలక్ష్మీ పథకానికి కాంగ్రెస్ ప్రభుత్వం తూట్లు పొడుస్తోంది



**హైదరాబాద్ ఆగస్టు 29 (సిద్దిపేట పవర్):** కేసీఆర్ ప్రవేశపెట్టిన కల్యాణ లక్ష్మి పథకానికి కాంగ్రెస్ ప్రభుత్వం తూట్లు పొడుస్తోందని ఎమ్మెల్సీ కవిత విమర్శించారు. పేదింటి ఆడబిడ్డ పెళ్లి తల్లిదండ్రులకు భారం కాకూడదని కేసీఆర్ ఈ పథకాన్ని తీసుకువచ్చారని చెప్పారు. నెలల తరబడి కళ్యాణ లక్ష్మి దరఖాస్తులను పరిశీలించకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని అన్నారు. తహశీల్దార్ కార్యాలయాల్లోనే 61వేలకు పైగా, అర్హత నిర్ధారణ స్థాయిలో 21 వేలకు పైగా దరఖాస్తులు పెండింగ్ లో ఉన్నాయంటే పేదల సంక్షేమం పై ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధి ఏపాటిదో స్పష్టం అవుతోందని చెప్పారు. ఎన్నికల ముందు పేదలు, ఆడబిడ్డలకు ఎన్నో హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ గద్దెనెక్కిన తరవాత వాటిని పూర్తిగా విస్మరించిందని చెప్పారు. కళ్యాణ లక్ష్మిలో రూ.లక్షతో పాటు తులం బంగారం ఇస్తామని నమ్మించి నయవంచన చేసిందని విమర్శించారు. కనీసం దరఖాస్తులు కూడా పరిశీలించకుండా క్రమేణా కళ్యాణలక్ష్మిని కనుమరుగు చేసే కుట్రకు తెరతీశారని మండిపడ్డారు.

## చేయూత పింఛన్ల పంపిణీలో సాంకేతిక విప్లవం..

**పోస్ట్ మాస్టర్లకు 5G ఫోన్లు,**
**ఫింగర్ ప్రింట్ పరికరాలు**

**హైదరాబాద్ ఆగస్టు 29 (సిద్దిపేట పవర్):**

రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సంక్షేమాన్ని ప్రధాన లక్ష్యంగా పెట్టుకొని చేయూత సామాజిక భద్రతా పింఛన్ల పథకంను అమలు చేస్తోంది. ఈ పథకం ద్వారా వృద్ధులు, దివ్యాంగులు, వితంతులు, ఒంటరి మహిళలు, హెచ్ఐవీ, డయాలసిస్ భాదితులు, గీత కార్మికులు, బీడీ కార్మికులకు ఆర్థిక భరోసా లభిస్తోంది. ప్రస్తుతం మొత్తం పదకొండు రకాల పింఛన్లు చేయూత పథకం కింద ప్రభుత్వం అందజేస్తోంది. ఇప్పటి వరకు పింఛన్ దారుల ధృవీకరణ కోసం 2 జీ ఆధారిత ఫింగర్ ప్రింట్ పరికరాలను వినియోగించేవారు. ఇప్పుడు వాటి స్థానంలో ఆధునిక సాంకేతికతతో కూడిన ఆధార్ ఆధారిత ముఖ గుర్తింపు సాఫ్ట్‌వేర్‌ను ప్రభుత్వం ప్రవేశపెట్టింది. ఈ కొత్త విధానం ద్వారా "సరైన వ్యక్తికి - సరైన పింఛన్ - సరైన సమయంలో" అందేలా పింఛన్ పంపిణీ మరింత ఖచ్చితంగా, పారదర్శకంగా మారనుంది. ఈ కార్యక్రమం కోసం ప్రభుత్వం రూ.15.50 కోట్ల బడ్జెట్‌తో 5G ఆధారిత L1 ఫింగర్ ప్రింట్ పరికరాలు, కొత్త మొబైల్ ఫోన్లను కొనుగోలు చేసింది. రాష్ట్రవ్యాప్తంగా 6,300 బ్రాంచ్ పోస్టుమాస్టర్లకు స్మార్ట్ మొబైల్ ఫోన్లు, పరికరాలు పంపిణీ చేయనున్నారు. స్మార్ట్ మొబైల్ ఫోన్లు పరికరాల పంపిణీ కార్యక్రమాన్ని పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి సీతక్క ములుగు జిల్లాలోని పస్రా కేంద్రంలో



ములుగు జిల్లా కలెక్టర్ టీఎస్ దివాకర్ తో కలిసి ప్రారంభించారు. కొద్ది రోజుల్లోనే రాష్ట్ర వ్యాప్తంగా 6300 మంది పోస్టుమాస్టర్లకు పరికరాలను అందజేయనున్నారు. ఫేస్ రికగ్నిషన్ సాఫ్ట్‌వేర్‌ను TG Online ప్రత్యేకంగా అభివృద్ధి చేసింది.

కొత్త సాంకేతిక పరిష్కారం వల్ల పింఛన్ దారుల ధృవీకరణ సమయం మూడు సెకన్లకు తగ్గి, పింఛన్లు వేగంగా పంపిణీ అవుతాయి. దీంతో లబ్ధిదారులు ఎక్కువసేపు వేచి ఉండాల్సిన అవసరం లేకుండా వెంటనే తమ పింఛన్లు అందుకుంటారు. ముఖ్యంగా వ్యవసాయ కూలీలు, వృద్ధులు, వేలిముద్రలు చెరిగిన వారు వంటి వారికి ముఖ గుర్తింపు యాప్ ఎంతో మేలు చేస్తోంది. ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచే దిశగా ఈ పథకం డిజిటల్ రూపాంతరం పొందడం ద్వారా పింఛన్ పంపిణీ వ్యవస్థలో పారదర్శకత, వేగం పెరిగి పింఛన్ దారులకు సత్వర సేవలు అందుతాయని మంత్రి సీతక్క ప్రకటించారు. పింఛన్దారుల సమస్యల దృష్టిలో పెట్టుకొని ఈ నూతన విధానాన్ని ప్రవేశ పెట్టినట్లు మంత్రి సీతక్క తెలిపారు.

## విద్యా బోధనలో నాణ్యత ప్రమాణాలు పెంచాలి....

**విద్యార్థులు, బోధన సిబ్బందికి**
**ఫేషియల్ రికగ్నేషన్ తప్పనిసరి**
**ఒకే విభాగం పరిధిలోకి**
**విద్యా శాఖ పరిధిలోని నిర్మాణాలు**
**గ్రీన్ ఛానల్‌లో మధ్యాహ్న**
**భోజన బిల్లుల చెల్లింపు**
**ప్రతి విద్యా సంస్థలో క్రీడలకు ప్రాధాన్యం....**
**విద్యా శాఖ సమీక్షలో**
**ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి**

**హైదరాబాద్ ఆగస్టు 29 (సిద్దిపేట పవర్):**

పాఠశాలలు మొదలు విశ్వ విద్యాలయాల వరకు ప్రతి విద్యా సంస్థలోనూ మెరుగైన బోధన సాగాలని.. విద్యా బోధనలో నాణ్యత ప్రమాణాలు మరింతగా పెంచాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఆదేశించారు. పాఠశాలలు, కళాశాలలు, ప్రొఫెషినల్ కోర్సులు బోధించే కళాశాలల్లో విద్యార్థులు, బోధన సిబ్బందికి ఫేషియల్ రికగ్నేషన్ తప్పనిసరి చేయాలని సీఎం ఆదేశించారు. ముఖ గుర్తింపుతో హాజరు శాతం మెరుగవడంతో పాటు ప్రొఫెషనల్ విద్యా సంస్థల్లో లోటుపాట్లను అరికట్టవచ్చన్నారు. విద్యా శాఖపై ఐసీసీసీలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి శుక్రవారం సమీక్ష నిర్వహించారు. విద్యా శాఖ పరిధిలో అదనపు గదులు, వంట గదులు, మూత్రశాలలు, మరుగుదొడ్లు, ప్రహరీల నిర్మాణం వివిధ విభాగాలు చేపట్టడం సరికాదని సీఎం అభిప్రాయపడ్డారు. ఈ నిర్మాణాల నాణ్యత ప్రమాణాలు, నిర్మాణ పర్యవేక్షణ, నిధుల మంజూరు, జవాబుదారీతనానికి గానూ ఒకే విభాగం కింద ఉండాలన్నారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల నిర్మాణాన్ని పర్యవేక్షిస్తున్న విద్యా, సంక్షేమ వసతుల అభివృద్ధి సంస్థ (EWIDC) కిందనే రాష్ట్రంలోని అన్ని విద్యా సంస్థల నిర్మాణాలు కొనసాగాలని సీఎం ఆదేశించారు.

ఈ సంస్థకు అవసరమైన ఇంజినీరింగ్, ఇతర సిబ్బందిని ఇతర విభాగాల నుంచి వెంటనే డిప్యూటేషన్‌పై తీసుకోవాలని సూచించారు. మధ్యాహ్న భోజన బిల్లుల చెల్లింపును గ్రీన్ ఛానల్‌లో చేపట్టాలని... ఈ విషయంలో ఎటువంటి అలసత్వం చూపొద్దని సీఎం అన్నారు. తెలంగాణలోని మహిళా కళాశాలలు, బాలికల పాఠశాలల్లో మూత్రశాలలు, మరుగుదొడ్లు, ప్రహరీల నిర్మాణాన్ని వేగవంతం చేయాలని సీఎం ఆదేశించారు. కంటైనర్ కిచెన్లకు ప్రాధాన్యమివ్వాలని.. కంటైనర్లపైన సోలార్ ప్యానెళ్లతో అవసరమైన విద్యుత్ వినియోగించుకోవచ్చని సీఎం తెలిపారు. ప్రతి పాఠశాలలో క్రీడలకు ప్రాధాన్యం ఇవ్వాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. అవసరమైతే కాంట్రాక్ట్ పద్ధతిన వ్యాయామ ఉపాధ్యాయులను నియమించే అంశాన్ని పరిశీలించాలని అధికారులను సీఎం ఆదేశించారు. అమ్మ ఆదర్శ పాఠశాలల కింద పాఠశాలల్లో పారిశుద్ధ్య పనులకు సంబంధించిన బిల్లులు తక్షణమే విడుదల చేయాలని సీఎం ఆదేశించారు. సంక్షేమ గురుకుల పాఠశాలల్లోని బాలికలకు వివిధ అంశాలపై కౌన్సెలింగ్ ఇచ్చేందుకు మహిళా కౌన్సెలర్లను నియమించాలని సీఎం సూచించారు. విద్యా రంగంపై పెడుతున్న ఖర్చును తాము ఖర్చుగా కాక పెట్టుబడిగా చూస్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు.



యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్స్ స్కూళ్లతో పాటు విద్యా రంగం అభివృద్ధికి తీసుకునే రుణాలను ఎఫ్ఆర్‌బీఎం పరిమితిలో లేకుండా చూడాలని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌కు విజ్ఞప్తి చేశారని సీఎం తెలిపారు. ప్రభుత్వ విద్యా సంస్థల్లో చదువుతున్న వారిలో 90 శాతానికి పైగా బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలే ఉన్నారని, ఈ విషయాన్ని నిర్ధారించేందుకు గత పదేళ్లలో ప్రభుత్వ విద్యా సంస్థల్లో చదివిన వారి వివరాలపై నివేదిక రూపొందించాలని సీఎం ఆదేశించారు. సమీక్షలో ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి బి.అజిత్ రెడ్డి, ముఖ్యమంత్రి ఓఎస్డీ వేముల శ్రీనివాసులు, విద్యా శాఖ ముఖ్య కార్యదర్శి యోగితా రాణా, ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి, సాంకేతిక విద్యా శాఖ కమిషనర్ శ్రీదేవసేన, పాఠశాల విద్యా శాఖ సంచాలకుడు నవీన్ నికోలస్ తదితరులు పాల్గొన్నారు.



## మొబైల్ ఫోన్ అనర్థాలపై అవేర్నెస్

**సికింద్రాబాద్, ఆగస్టు 29 ( సిద్ధిపేట పవర్ ):**

మొబైల్ ఫోన్ వాడకంతో కలుగు అనర్థాలపై కేశవ్ మెమోరియల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (KMIT) స్టూడెంట్స్ బోలక్పూర్ లోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్ విద్యార్థులకు శుక్రవారం అవేర్నెస్ కల్పించారు. అలాగే భద్రత జాగ్రత్తలపై ఒక స్కిట్ (నాటిక) ను ప్రదర్శించారు. ఎమర్జెన్సీ సమయంలో డయల్ 100, 1091, 112 లకు కాల్ చేయాలన్నారు. గుడ్ టచ్ బ్యాడ్ టచ్ గురించి వివరించారు.ఈ కార్యక్రమంలో స్కూల్ కరస్పాండెంట్ డాక్టర్ మంచాల శ్రీనివాసులు, ప్రిన్సిపాల్ వరలక్ష్మి మంచాల, ఎన్ ఎస్ ఎస్ ప్రతినిధులు నితిన్ చౌదరి, అంజలి,వైష్ణవి, రవీందర్, సిద్ధార్థ, సిబ్బంది పాల్గొన్నారు.



## నూతన ఆత్మకమిటీ పాలకవర్గ ప్రమాణస్వీకారం

**చేర్యాల , ఆగస్టు 29 (సిద్దిపేట పవర్)** నేడు చేర్యాల డివిజన్ ఆత్మ కమిటీ చైర్మన్ మరియు పాలకవర్గ ప్రమాణస్వీకార కార్యక్రమంలో పాల్గొని నూతన చైర్మన్ గా ఎన్నికైన జక్కుల తిరుపతి కి మరియు మిగత పాలకవర్గ సభ్యులకు నా శుభాకాంక్షలు తెలియజేసినా జనగామ జిల్లా డీసీసీ అధ్యక్షులు కొమ్మూరి ప్రతాప్ రెడ్డి...ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ATMA (అగ్రికల్చర్ టెక్నాలజీ మేనేజ్మెంట్ ఏజెన్సీ) ద్వారా చేర్యాల లోని ప్రతి గ్రామంలో సమీక్షలు ఏర్పరచి ప్రతి రైతుకు నూతన వ్యవసాయం మరియు ఆర్గానిక్ పద్ధతిద్వార పంటలను పండించే విధంగా వారికి సలహాలు, సూచనలు అందించాలని మరియు అందరూ ఆర్గానిక్ పద్ధతిద్వార పండించిన ఆహారాన్ని తిని ఆరోగ్యాన్ని మెరుగు పరుచుకోవాలని ఆకాంక్షిస్తున్నాను అని తెలిపారు..



## శాంతియుత వాతావరణంలో ఉత్సవాలు నిర్వహించుకోవాలి

**సీఐ పాలెపు శ్రీనివాస్**

**దుబ్బాక సిద్ధిపేట పవర్ న్యూస్ ఆగస్టు 29 ప్రతినిధి** వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలను ప్రశాంతమైన వాతావరణంలో నిర్వహించుకోవాలని, శాంతి భద్రతల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని దుబ్బాక సీఐ పాలెపు శ్రీనివాస్ అన్నారు.శుక్రవారం దుబ్బాక పోలీస్ సర్కిల్ కార్యాలయంలో వినాయక మండప నిర్వాహకులతో ఏర్పాటు చేసిన పీస్ కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని, మాట్లాడారు. మండపాల వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా నిర్వాహకులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, మండపాల వద్ద ప్రతి రోజు రాత్రి ఇద్దరూ చొప్పున కాపలాగా ఉండాలని సూచించారు. విద్యుత్ ప్రమాదాలకు తావు లేకుండా చూసుకోవాలని, సమస్యలు ఉత్పన్నమైతే తక్షణమే విద్యుత్ శాఖ అధికారులను సంప్రదించాలని కోరారు. నిమజ్జనం రోజున పెద్ద చెరువు వద్ద పురపాలిక సిబ్బందితో కలిసి ప్రత్యేక ఏర్పాట్లు చేస్తామని, గత ఈతగాలను అందుబాటులో ఉంచుతామని, నిమజ్జనానికి క్రేన్ సౌకర్యం కూడా కల్పించనున్నట్లు తెలిపారు. పట్టణ ప్రజల సహకారంతో వినాయక నవరాత్రి ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించాలని ఆకాంక్షించారు. ఈ సమావేశంలో దుబ్బాక ఎస్సై కే.కీర్తి రాజు, మండపనిర్వాకులు తదితరులు పాల్గొన్నారు.




## బాధిత కుటుంబానికి 50వేల ఆర్థిక భరోసాను అందించిన కరీంనగర్ డైరీ సంస్థ చెర్మెన్




**దుబ్బాక, సిద్ధిపేట పవర్ న్యూస్ ఆగస్టు 29** కరీంనగర్ డైరీ, దాని సభ్యులకు ఆర్థిక భరోసా కల్పించడంలో భాగంగా హఠాత్తుగా మరణించిన సభ్యుల కుటుంబాలకు ₹50,000 రైతు భరోసా (బీమా) అందిస్తుంది.ఈ పథకం కింద, సిద్దిపేట జిల్లా దుబ్బాక మండలం రామక్కపేట గ్రామానికి చెందిన గుంటి నర్సింలు (తండ్రి గుంటి లచ్చయ్య) యొక్క కుటుంబానికి కరీంనగర్ డైరీ ఈ సహాయాన్ని అందించింది.డిసెంబర్ 14న జరిగిన ప్రమాదంలో మరణించిన గుంటి నర్సింలు భార్య గుంటి మాధవికి,కరీంనగర్ డైరీ చైర్మన్ చలిమెడ రాజేశ్వరరావు ఆధ్వర్యంలో సిరిసిల్ల జిల్లాలోని హగ్రహారంలో ₹50,000 ఆర్థిక సహాయం చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ డైరీ మేనేజర్ రాజు,ప్రెసిడెంట్ చింతల ప్రశాంత్,సూపర్వైజర్ బోట్ల ప్రవీణ్,కార్యదర్శి గుంటి కనకరాజు కూడా పాల్గొన్నారు.ఈ ఆర్థిక సహాయం కుటుంబానికి కొంత ఉపశమనం కల్పిస్తుందని డైరీ సభ్యులు పేర్కొన్నారు.

# గత పాలకులు యూరియా కోసం ఇంత ఇబ్బందులు పెట్టలేదు





**దుబ్బాక సిద్దిపేట పవర్ న్యూస్ ఆగస్టు 29 ప్రతినిధి**

మరి రేవంత్ సర్కారం యూరియా కోసం నెల రోజుల నుండి సహకార సంఘాల వద్ద పడిగాపులు కాసిన ఒక యూరియా బస్తా కూడా దొరకడం లేదంటూ సర్కారుపై రైతులు దుమ్మెత్తి పోస్తున్నారు సిద్దిపేట జిల్లాలో వాయిస్ ఓవర్ సిద్దిపేట జిల్లా దుబ్బాక నియోజకవర్గం లో ఎడతెరిపి లేకుండా వర్షాలకు వాగులు వంకలు పొంగి పొర్లుతుంటే మరోపక్క రైతులు యూరియా కోసం దౌల్తాబాద్ రాయపోల్ తొగుట మిరుదొడ్డి దుబ్బాక ప్రాంతాల్లో యూరియా కోసం కోడి కూయకముందే ఆధార్ కార్డులు పట్టుకుని మహిళా రైతులు ఇంటి పనులు సైతం వదులుకొని యూరియా కోసం క్యూలైన్లో వేచి చూడాల్సిన పరిస్థితి గత నెల రోజుల నుండి అందరికీ కనులకు కట్టినట్టే కనిపిస్తున్నాయి సందర్భంగా మహిళ రైతు మాట్లాడుతూ.. గత సర్కారు యూరియా కోసం ఇంత ఇబ్బందులు పెట్టలేదని అన్నారు కానీ కాంగ్రెస్ సర్కారు మాత్రం యూరియా కోసం ముక్కు తిప్పలు పెడుతుందని అన్నారు .మాయ మాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం మేనిఫెస్టోలో చెప్పిన ఒక హామీని కూడా నెరవేర్చకపోవడంతో పాటు యూరియా కోసం అయితే రైతులను ఇబ్బందులు పెడుతున్నాయని అన్నారు ఇప్పటికైనా సర్కారు స్పందించి రైతులకు కావాల్సిన యూరియా అందజేయాలని డిమాండ్ చేస్తున్నామని అన్నారు అనంతరం వారు మాట్లాడుతూ రైతులంటేనే కాంగ్రెస్ గొప్పలు చెప్పుకునే పార్టీగా మిగిలిపోయిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం యూరియా ప్రతి ఇంటికి పంపించే స్థాయికి ఎదిగిందని వారు అన్నారు. రైతే రాజు అన్న కాంగ్రెస్ రైతుకు కన్నీరు పెట్టే ప్రభుత్వంగా మిగిలిందని రైతులు దుబ్బాకలో ఆవేదన వ్యక్తం చేస్తూ నిరంతరం నిదుర పగలు ఏమి తేడా లేని ప్రభుత్వం గా మిగిలిపోయిందని వాపోయారు. రాబోయే స్థానిక ఎన్నికల తగిన గుణపాఠం చెప్పడం ఖాయమని వారు డిమాండ్ చేశారు



## దుబ్బాక వంద పడకల ఆస్పత్రిలో ఘనంగా వినాయక నవరాత్రి ఉత్సవాలు


**దుబ్బాక ఆసుపత్రి సూపర్డెంట్ హేమా రాజ్ సింగ్**

**దుబ్బాక సిద్దిపేట పవర్ న్యూస్ ఆగస్టు 29 ప్రతి నిధి** సిద్దిపేట జిల్లా దుబ్బాక ప్రభుత్వ వంద పడకల ఆసుపత్రిలో గణేష్ నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి.ఆసుపత్రి ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహానికి ప్రత్యేక పూజలు,హారతి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.మూడవ రోజు పూజలో ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ హేమరాజ్ సింగ్ స్వయంగా పాల్గొని పూజలు నిర్వహించారు. వైద్యులు, నర్సులు, ఇతర ఆసుపత్రి సిబ్బంది కూడా భక్తి శ్రద్ధలతో పూజలో పాల్గొన్నారు. ఈ ఉత్సవాలు ఆసుపత్రిలో సానుకూల వాతావరణాన్ని తీసుకువచ్చాయని సూపరిండెంట్ తెలిపారు. ఇలాంటి కార్యక్రమాలు రోగులు మరియు సిబ్బందిలో ఉత్సాహాన్ని నింపుతాయని ఆయన చెప్పారు.



## పర్యావరణహితంగా పండుగలు జరుపుకోవాలి

**మండలానికి మట్టి ప్రతిమలు పంపిన మాజీ ఎంపీ**



**చేర్యాల, ఆగస్టు 29 (సిద్దిపేట పవర్)** శ్రీ మహాగణపతి వినాయక చవితి దివ్యమైన పర్వదినాన్ని పురస్కరించుకుని, ప్రకృతి పరిరక్షణకు మద్దతుగా మాజీ ఎంపీ జోగినపల్లి సంతోష్ కుమార్ చేపట్టిన మట్టి వినాయక విగ్రహాల పంపిణీ కార్యక్రమంలో భాగంగా, చేర్యాల మండల యువజన నాయకులు తాండ్ర సాగర్ కి మట్టి వినాయక ప్రతిమను పంపారు...ఈ సందర్భంగా సాగర్ మాట్లాడుతూ నన్ను గుర్తు పెట్టుకొని ఈ ప్రతిమను నాకు పంపిన సుంత్రానంద్ తానోభ అక్క కి హృదయపూర్వక కృతజ్ఞతలు. మీ అభిమానం, అనుబంధం ఎల్లప్పుడూ నాకు ప్రేరణగా నిలుస్తుంది అని తెలిపారు....మీరు చేస్తున్న ఈ మహాయజ్ఞంలో నా పాత్రకూడా ఉంది అని గుర్తుచేసినందుకు, నా వంతు పాత్ర నా శాయశక్తుల నిర్వహిస్తానని సాగర్ తెలిపారు..

## పాపం.. చిన్నారి తప్పిపోయింది..

**చేరదీసిన గాంధీ ఆసుపత్రి సెక్యూరిటీ సిబ్బంది**




**సికింద్రాబాద్, ఆగస్ట్ 29 ( సిద్ది పేట పవర్)** సికింద్రాబాద్ గాంధీ ఆసుపత్రిలో శుక్రవారం మధ్యాహ్నం ఓ చిన్నారి పాప తప్పిపోయింది. దాదాపు మూడు సంవత్సరాల వయసు కలిగిన ఒంటరిగా ఉన్న పాపను గాంధీ ఆవరణలో చూసిన ఆస్పత్రి సెక్యూరిటీ సిబ్బంది చేరదీసి, ఫుడ్డు పెట్టారు. పాపను పేరు అడగగా కార్తిక అని చెబుతుందని, ఇతర వివరాలు చెప్పడం లేదని జీడీఎక్స్ సెక్యూరిటీ ఇంచార్జ్ శివాజీ తెలిపారు. కాగా చిన్నారి తల్లి పాపను గాంధీలో విడిచి పెట్టి వెళ్లిపోయినట్లు భావిస్తున్నారు. బహుశా తల్లికి మతిస్థిమితం లేకపోయి ఉండొచ్చని సిబ్బంది అభిప్రాయపడుతున్నారు. చిన్నారి పాప తమ చెంత ఉందని చిలకలగూడ పోలీసులకు సమాచారం ఇచ్చినట్లు సెక్యూరిటీ సిబ్బంది తెలిపారు.

## ఉమ్మడి మెదక్ జిల్లా ఇంచార్జి గడ్డం వివేక్ వెంకట్ స్వామి ని కలిసిన బిజీ వెంకటాపూర్ నాయకులు

**సమస్యల పరిష్కారానికి సానుకూలంగా స్పందించిన మంత్రి**

**సిద్ది పేట పవర్ గజ్వెల్ నియోజకవర్గం :** జగదేవపూర్ మండలం బిజీ వెంకటాపూర్ గ్రామానికి చెందిన నాయకులు సోమాజిగూడలోని కార్మిక మైనింగ్ ఉపాధి శాఖ మంత్రి జిల్లా ఇంచార్జ్ మంత్రి వర్యులు గడ్డం వివేక్ వెంకటస్వామిని తన నివాసంలో శుక్రవారం కలిసి బీజి వెంకటాపూర్ గ్రామంలో నెలకొన్న పలు సమస్యల సైడ్ డ్రైనేజీ 300 వందల సీసీ రోడ్డు నిర్మాణ పనుల గురించి రిప్రజెంటేషన్ ఇవ్వడం జరిగిందని అన్నారు. ఈ సందర్భంగా బిజీ వెంకటాపూర్ నాయకులు మాట్లాడుతూ జిల్లా ఇంచార్జి మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి సానుకూలంగా స్పందించి పనులకు సంబంధించిన వర్క్ ఎస్టిమేషన్లు రెడీ చేయవలసిందిగా సంబంధిత అధికారులకు ఆదేశాలను ఇవ్వడం జరిగింది. అడిగిన వెంటనే స్పందించి సమస్య పరిష్కారానికి కృషి చేసిన మంత్రి కి ప్రత్యేక ధన్యవాదాలు. వారితో పాటుగా గ్రామ తాజా మాజీ సర్పంచ్ మంజుల రమేష్ నాయకులు చెక్కల పరమేశ్వర్ రూపేష్ నందు వేణు రంజిత్ కుమార్ తదితరులు ఉన్నారు.





## కాంగ్రెస్ బీజేపీలు రైతులకు యూరియా ఇవ్వాలేని దద్దమ్మ ప్రభుత్వాలు

- యూరియా కోసం తెల్లవారుజాము నుండే బారులు తీరిన రైతులు
- ఆందోళన చెందవద్దంటున్న అధికారులు

**సిద్దిపేట పవర్ గజ్వెల్ నియోజకవర్గం** జగదేవపూర్ మండల కేంద్రంలో యూరియా కోసం రైతన్నలు తిప్పలు..... మండలం కేంద్రంలోని హెచ్ ఏ సి ఏ సర్వీసింగ్ సెంటర్ ,శివాలయం రోడ్డు పిండి గిర్ని ఎదురుగా వద్ద రైతులు పెద్ద ఎత్తున చేరుకొని క్యూలో పట్టా పాస్ పుస్తకాలు పెట్టి పడికాపులు కాస్తున్నారు.శుక్రవారం తెల్లవారుజామున నుండి సుమారు 200 మందికి పైగా రైతులు కేంద్రానికి చేరుకొని బారులు తీరారు.రైతులు మాట్లాడుతూ కాంగ్రెస్ బీజేపీ ప్రభుత్వాలు యూరియా ఇవ్వాలెని అసమర్ధ దద్దమ్మ ప్రభుత్వాలని అన్నారు. అన్నదాతల అవసరాలకు సరిపడా యురియా సరఫరా చేయాలని మండల రైతులు కోరారు.





## 3 వ రోజు దుబ్బాక లో నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహణ.

**కత్తి కార్తిక గౌడ్ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం.**

దుబ్బాక సిద్దిపేట పవర్ న్యూస్ ఆగష్టు 29. ప్రతినిధి సిద్దిపేట జిల్లా దుబ్బాక మండల కేంద్రంలోని కత్తి కార్తికఫౌండేషన్ ఆధ్వర్యంలో శ్రీ సిద్ధి వినాయక స్వామివారి నవరాత్రి ఉత్సవాలు రెండవ రోజు భక్తిశ్రద్ధలతో నిర్వహించబడ్డాయి. ఈ సందర్భంగా కత్తి కార్తీక గౌడ్ బిఆర్ఎస్ పార్టీ ఆఫీస్ నందు నిర్వహించిన కార్యక్రమాల్లో కత్తి కార్తిక గౌడ్ స్వామివారిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులకు నిత్య అన్నదాన కార్యక్రమంలో భాగంగా ఆమె స్వయంగా అన్నప్రసాదాల పంపిణీ చేసి, భక్తులందరికి శుభాకాంక్షలు తెలిపారు



# గణపతి నవరాత్రి ఉత్సవాల్లో పాల్గొన్న తాజా మాజీ మున్సిపల్ చైర్మన్ రాజమౌళి

- సిద్దిపేట జిల్లా స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షులు యన్ సి సంతోష్
- వెంకటేశ్వర స్వామి ఆలయం వద్ద అరటాకులో అన్నప్రసాదం
- 3 వ రెండవ రోజు గణపతి నవరాత్రి ఉత్సవాలు



సిద్దిపేట పవర్ గజ్వెల్ నియోజకవర్గం: గజ్వేల్ శ్రీ వెంకటేశ్వర ఆలయం వద్ద ఏర్పాటు చేసిన భారీ గణపతి మండపంలో గణపతి నవరాత్రి ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. శుక్రవారం గణపతి నవరాత్రి ఉత్సవాలలో పాల్గొని స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నప్రసాద కార్యక్రమం లో పాల్గొని భక్తులకు అన్న ప్రసాదం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ దైవభక్తి కలిగి ఉండాలని, దైవ నామ స్మరణతోనే మానవ జీవితానికి ముక్తి కలుగుతుందని, ఆదిదేవుడు మహాగణపతి అనుగ్రహంతో అందరూ బాగుండాలని, గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలో పెద్ద ఎత్తున వినాయక మండపాలు ఏర్పాటు చేసిన నిర్వాహకులు జాగ్రత్తలు పాటిస్తూ భక్తిశ్రద్ధలతో గణపతి నవరాత్రి ఉత్సవాలు జరుపుకోవాలని కోరుకుంటూ, శ్రీ వెంకటేశ్వర ఆలయం వద్ద ఏర్పాటుచేసిన వినాయక మండపం అత్యంత అద్భుతంగా ఉందని, ఆరోగ్యమే మహాభాగ్యం అని, మహా అన్నప్రసాదం స్టీల్ ప్లేట్, అరటి ఆకులో అందజేయడం అభినందనీయమని, ప్రతి ఒక్కరు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని ప్లాస్టిక్ వాడకం తగ్గించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి సంఘం పట్టణ అధ్యక్షులు రాజారాం, గణపతి విగ్రహ దాత వంగమోహన్, ఇటిక్యాల తాజా మాజీ సర్పంచ్ రావికంటి చంద్రశేఖర్, ఆర్యవైశ్య మహాసభ పట్టణ ఉపాధ్యక్షుడు అయిత సత్యనారాయణ, నాయకులు ఆదిమూలం రవి, నాగేష్, వెంకటరెడ్డి, అత్తెల్లి రవి, ఉత్తునూరి సంపత్, కొమురవెల్లి రమేష్, రవీందర్ చారి, గందే సంతోష్, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## ఉస్మానియా వర్సిటీలో దారుణ పరిస్థితులు

**ఎన్హెచ్ఆర్సీ లో అడ్వకేట్ రామారావు పిటిషన్**



**సికింద్రాబాద్, ఆగస్ట్ 29 ( సిద్దిపేట పవర్)** : ఉస్మానియా విశ్వవిద్యాలయం లో నెలకొని వున్న దారుణ పరిస్థితులపై ప్రముఖ మానవ హక్కుల అడ్వకేట్ రామారావు ఇమ్మానేని జాతీయ మానవ హక్కుల కమిషన్ లో పిటిషన్ వేశారు. సాక్షాత్తు ఈఐ హాస్టల్ లో న్యాయశాస్త్రం అభ్యసించే విద్యార్థులకు ప్రాథమిక హక్కులు కొరవడ్డాయన్నారు. 120 మందికి ఒకే బాత్రూం ఉందని, వర్షానికి గదుల పైకప్పుల నుంచి నీరు కురుస్తుందని, వాటర్ ఫిల్టర్లు కనిపించడంలేదన్నారు. ఒకే గదిలో 8 నుండి పదిమంది విద్యార్థులు ఉంటున్నారన్నారు. తెలంగాణ బిడ్డలు నానా ఇబ్బందులు పడుతున్న సంబందిత యూనివర్శిటీ అధికారులు కనీసం పట్టించుకోవడం లేదని పిటిషన్ లో పేర్కొన్నారు. వైస్ ఛాన్సలర్ వెంటనే చర్యలు తీసుకొనే విధంగా ఆదేశాలు జారీ చెయ్యాలంటూ జాతీయ మానవ హక్కుల కమిషన్ లో పిటిషన్ దాఖలు చేసిన ప్రముఖ మానవ హక్కుల న్యాయవాది రామా రావు ఇమ్మానేని పిటిషన్ ను గుర్తింపు సంఖ్య 20963/IN/2025 గా నమోదు చేసిన జాతీయ మావన హక్కుల కమిషన్ విచారణ చేపట్టింది.

## అనంతసాగర్ లో డెంగ్యూ జ్వరానికి యశ్వంత్ మృతి

**సిద్దిపేట పవర్**



జగదేవపూర్ మండలం అనంత సాగర్ గ్రామానికి చెందిన బోనగిరి యశ్వంత్ (10) డెంగ్యూ జ్వరంతో బాధపడుతూ మృతి చెందారు. అర్ధరాత్రి 12 గంటల ప్రాంతం లో డెంగ్యూ జ్వరంతో మృతి చెంది అనంత సాగర్ లో విషాద ఛాయలు అలుముకున్నాయి. జిల్లా కలెక్టర్ హైమావతి అదనపు కలెక్టర్ గరిమా అగ్వాల్ పర్యటించిన ప్రజల ప్రాణాలు కాపాడే నాధుడు లేక పోతున్నరని గ్రామ ప్రజలు, అనంతసాగర్, తిమ్మాపూర్ గ్రామాల్లో విష జ్వరాలు రోజుకు పెరుగుతున్న ఫీవర్ టెస్టులు చేయాలనీ అన్న ఇంతవరకు క్యాంపులు పెట్టలేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## విష జ్వరాలు ఆలస్యం చేస్తే ప్రాణాంతకం

**డిస్టిక్ హాస్పిటల్ సూపరింటెండెంట్ గజ్వేల్ డాక్టర్ అన్నపూర్ణ**

**సిద్దిపేట పవర్ గజ్వేల్ నియోజకవర్గం** :గజ్వేల్ డిస్ట్రిక్ట్ హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ అన్నపూర్ణ .చిల్డ్రన్స్ వార్డులోనూ జనరల్ వార్డులోను అడ్మిట్ అయి ఉన్న జ్వరంతో కూడుకున్న అనుమానిత డెంగ్యూ ఫీవర్ కేసులను పరామర్శించడం జరిగింది. ఒక్కొక్కరిని వారి యొక్క ఆరోగ్య పరిస్థితినీ రిపోర్ట్స్ తెప్పించి చూసి సూచనలు సలహాలు ఇవ్వడం జరిగింది.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్షాకాలంలో నీటిని కాచి చల్లార్చి తాగాలని ఇంటిని చుట్టుముట్టు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని ఇంటిముందు ఇంటి వెనుక మురికి నీటి గుంటలు లేకుండా చూసుకోవాలని ఇంట్లోకి దోమలు రాకుండా ఇంటి దర్వాదాలకు, కిటికీలకు, జాలీలు అమర్చుకోవాలని నిద్రిస్తున్న సమయంలో గుడ్ నైట్, ఆల్ అవుట్ వాడుకోని దోమల నుండి రక్షించుకోవాలని లేదంటే విషపూరితమైన జ్వరముతో కూడిన డెంగ్యూ మలేరియా, చికెన్ గునియా ఫైలేరియా లాంటి వ్యాధులతో ప్రమాదం పొంచి ఉందని సూచించనారు. వీరి వెంట జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ధనరాజ్ డిప్యూటీ డి ఎం హెచ్ ఓ డాక్టర్ శ్రీనివాస్ ఇన్ఫెక్షన్ కంట్రోల్ ఆఫీసర్ మహారాజ్ భాను హాస్పిటల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.





## ప్రజావాణి తరహాలో కంటోన్మెంట్ వాణి

**ఎమ్మెల్యే శ్రీగణేశ్**

**సికింద్రాబాద్, ఆగస్ట్ 29 ( సిద్దిపేట పవర్ )**:ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు రాష్ట్రప్రభుత్వం ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమం మాదిరిగానే ఇక నుంచి కంటోన్మెంట్ వాణిని నిర్వహించనున్నారు. కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేశ్ శుక్రవారం మీడియాతో మాట్లాడారు. కంటోన్మెంట్ నియోజకవర్గంలో ప్రజలు ఎదుర్కొంటున్న వివిద సమస్యలను పరిష్కరించేందుకు వీలుగా ప్రతినెలా 10 న ఉదయం 11 నుంచి 2 గంటల వరకు కంటోన్మెంట్ వాణి కార్యక్రమాన్ని నిర్వహించడానికి నిర్ణయించినట్లు ప్రకటించారు. దీని వలన రోజుల తరబడి ప్రజలు తమ సమస్యల పరిష్కారం కొరకు కార్యాలయాల చుట్టూ తిరగడం తప్పుతుందన్నారు. ఈమేరకు కంటోన్మెంట్ సీఈవో ను కలిసి కంటోన్మెంట్ వాణి కార్యక్రమం గురించి, వివరించగా, ఆయన సానుకూలంగా స్పందించారన్నారు. ఇది ఒక మంచి కార్యక్రమమని ఇందులో అధికారులు అంతా పాల్గొంటామని సీఈవో తెలిపారు. రానున్న సెప్టెంబర్ 10 నుంచి కంటోన్మెంట్ వాణి ప్రారంభం అవుతుందన్నారు. కంటోన్మెంట్ వాణిలో ప్రజలు ఇచ్చే అర్జీల్లో పేర్కొన్న సమస్యలను అప్పటికప్పుడే పరిష్కరిస్తామని, లేనిపక్షంలో గడువు నిర్ణయించి, సత్వరంగా పరిష్కరిస్తామని ఎమ్మెల్యే శ్రీగణేశ్ వివరించారు.

## అనంతసాగర్ లో డెంగ్యూ జ్వరం తో యశ్వంత్ మృతి

**మృతుని కుటుంబాన్ని పరమర్శిం చిన గజ్వెల్ బీ ఆర్ యస్ ఇంచార్జి వంటేరు ప్రతాప్ రెడ్డి**



**సిద్దిపేట పవర్ గజ్వెల్ నియోజకవర్గం:** జగదేవపూర్ మండలంలోని అనంతసాగర్ గ్రామంలో యశ్వంత్ అనే విద్యార్థి వయసు పది సంవత్సరాలు డెంగ్యూ జ్వరంతో బాధపడుతూ మృతి చెందాడు.విషయం తెలుసుకున్న గజ్వేల్ నియోజకవర్గం బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ వంటేరు ప్రతాప్ రెడ్డి వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలిపారు ధైర్యంగా ఉండాలని చెప్పి మనోధైర్యాన్ని కల్పించారు. ఈ సందర్భంగా వంటేరు ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ పది సంవత్సరాలు వయసు కలిగిన యశ్వంత్ అనే విద్యార్థి డెంగ్యూ జ్వరంతో చనిపోవడం చాలా బాధాకరమని విచారణ వ్యక్తం చేశారు.దాదాపు అన్నసర గ్రామంలో 200 మంది వరకు ప్రజలు విష జ్వరాలతో డెంగ్యూ జ్వరాలతో మంచమేక్కారని చాలామంది గజ్వేల్ లోని ప్రభుత్వ ప్రైవేటు ఆసుపత్రిలో కెళ్ళి చికిత్స పొందుతున్నారని తెలిపారు.

మొన్ననే గ్రామమైనటువంటి తిమ్మాపూర్ గ్రామంలో కొంత మహేష్ 35 శ్రావణ్ 16 సంవత్సరాలు వయసు కలిగిన ఇద్దరు డెంగితో చనిపోయారని వారి కుటుంబాలను మాజీమంత్రి హరీష్ రావు పరామర్శించారని తెలిపారు అయినా ఈ ప్రభుత్వానికి చల్లడం లేకుండా పోయిందని అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని తెలిపారు. ఈ గ్రామాలలో డెంగ్యూ జ్వరం మృత్యు గంటలు మోగిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి చీమకుట్టినట్లు కూడా లేదని తెలిపారు.ఈ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల జీవితాలతో చెలగాటమాడుతుందని ప్రజల ఆరోగ్యాలతో చెలగాటమాడుతుందని చిన్నచిన్న పిల్లలు చనిపోతా ఉంటే ఈ ప్రభుత్వానికి ఇంత నిర్లక్ష్యం ఎందుకని తెలిపారు. డెంగ్యూ జ్వరాల బారిన పడి చనిపోయిన కుటుంబ సభ్యులు శోకసముద్రంలో మునిగారని తెలిపారు వారి కుటుంబ సభ్యులను పరామర్శించలేని స్థితిలో మంత్రులు ముఖ్యమంత్రి ఉన్నారని తెలిపారు. గతంలోని కేసీఆర్ ప్రభుత్వం ముందు చూపుతో వర్షాకాలం సీజన్ ప్రారంభం కాకముందే అధికారులకు ఆదేశాలు జారీ చేసి పంచాయతీ సెక్రెటరీ ల ద్వారా గ్రామాలలో ప్రజల ఆరోగ్యం పట్ల స్పెషల్ డ్రైవ్ చేపట్టే వారని తెలిపారు. గతంలోని కేసీఆర్ ప్రభుత్వం ప్రతి గ్రామానికి ట్రాక్టర్ ఇచ్చి తడి చెత్త పొడి చెత్త బుట్టలను పంపిణీ చేసి నేరుగా ట్రాక్టర్ ద్వారా ప్రతి ఇంటి ముందుకు వెళ్లి చెత్త సేకరణ చేసి , వర్షాకాలంలో సైతం ఎక్కడ కూడా నీటి నిల్వ లేకుండా చేసి పెంట కుప్పలు లేకుండా, గడ్డి లేకుండా, చెత్త లేకుండా చేసి ఫ్రైడే డ్రై డే అనే కార్యక్రమల ద్వారా, ప్రజల ఆరోగ్యాల పట్ల జాగ్రత్తలు తీసుకుంటూ ప్రజలను అప్రమత్తం చేస్తూ చైతన్యవంతం చేసి ప్రజలను పిల్లలను సురక్షితంగా ఉంచి ప్రజలను విష జ్వరాల బారిన పడకుండా ముందు జాగ్రత్త చర్యలను చేపట్టి ఆరోగ్య రహిత గ్రామాలుగా పరిశుభ్ర గ్రామాలుగా మార్చిన ఘనత గతంలోని కేసీఆర్ ప్రభుత్వానిది.గతంలోని కెసిఆర్ ప్రభుత్వంలో తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఏ గ్రామంలో కూడా పారిశుధ్య లోపం లేదన్నారు గ్రామాలు ఆరోగ్య గ్రామాలుగా మారాయన్నారు. నేడు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉండి పారిశుధ్య పనులను కూడా పట్టించుకోవడంలేదని గ్రామాలలో పారిశుద్ధ్యం పడకేసిందని తెలిపారు దానితో గ్రామాలలోని ప్రజలు విష జ్వరాలతో , డెంగీ జ్వరాలు ప్రబలి పడకెక్కుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.దీనికి కారణం కాంగ్రెస్ ప్రభుత్వ అసమర్థ విధానాలు అనాలోచిత విధానాలు ముందు చూపులేని ప్రణాళికలు అసమర్థ పాలన అని తెలిపారు.గతంలోని కేసీఆర్ ప్రభుత్వం పారిశుధ్య నివారణకు ఇచ్చిన గ్రామంలోని ట్రాక్టర్లు పడవుపడి పోయినయి అన్నారు. సెక్రటరీలు తమ దగ్గర ట్రాక్టర్లు నడపడానికి డీజిల్ కు డబ్బులు లేక గ్రామపంచాయతీలకు తాళాలు వేస్తున్నారని తెలిపారు

### హే గాంధీ..నిలిచిన నీటి సరఫరా..

# రోగుల పరేషాన్..




- 24 గంటల పాటు గాంధీలో నో వాటర్
- నిలిచిపోయిన ఆపరేషన్లు.. కంపుకొట్టిన వాష్ రూమ్స్
- రోగులు, సహాయకులు,నర్సింగ్ సిబ్బంది నరకయాతన

**సికింద్రాబాద్, ఆగస్ట్ 29 ( సిద్దిపేట పవర్)** :గాంధీఆస్పత్రి మెయిన్ బిల్డింగ్ లోని ఇన్పేషంట్ల వార్డులు, ఆపరేషన్ థియేటర్లకు మంచినీటి సరఫరా చేసే పంపింగ్ మోటార్లు మొరాయించడంతో దాదాపు 24 గంటల పాటు నీటి సరఫరా నిలిచిపోయి రోగులు, వైద్యసిబ్బంది తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. పలు విభాగాలకు చెందిన ఆపరేషన్ థియేటర్లలో శస్త్రచికిత్సలు వాయిదా పడగా, వైద్యసేవల్లో తీవ్ర జాప్యం నెలకొంది. గురువారం రాత్రి నీటి సరఫరా నిలిచిపోగా 24 గంటలు గడుస్తున్నా గాంధీ పాలనయంత్రాంగం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయలేదని పలువురు వాపోయారు. వివరాలు... ప్రత్యేక పైప్‌లైన్ ద్వారా జలమండలి నుంచి సరఫరా అయ్యే మంచినీరు ఆసుపత్రి ఆవరణలోని పంప్‌హౌస్‌సంపులో పడుతుంది. అక్కడి నుంచి ఆరు పంపుసెట్ల ద్వారా ఆస్పత్రి ప్రధాన భవనం పైనగల ఓవర్‌హెడ్ ట్యాంకులకు అక్కడి నుంచి పైప్‌లైన్ల ద్వారా ఆయా విభాగాలకు చేరుతుంది. ఈ క్రమంలో గురువారం రాత్రి 10 గంటల సమయంలో పంప్‌హౌస్‌లోని ఆరు మోటార్లు ఒకేసారి సమస్య తలెత్తడంలో నీటి సరఫరాలో ఇబ్బంది తలెత్తింది. గురువారం అర్ధరాత్రి నుంచి ప్రధాన భవనం 8 అంతస్థుల్లోని వార్డులకు నీటి సరఫరా నిలిచిపోవడంతో రోగులు, వైద్యసిబ్బంది తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. ఆయా విభాగాల్లోని ఆపరేషన్ థియేటర్లలో శస్త్రచికిత్సలు వాయిదా పడ్డాయి. వైద్యసేవల్లో జాప్యం నెలకొంది. ఓ వైపు తెలంగాణలో భారీవర్షాలు కురుస్తుండగా, గాంధీఆస్పత్రిలో మాత్రం గుక్కెడు నీటి కోసం అల్లాడుతున్నామని పలువురు రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నీటి సరఫరా నిలిచిపోవడంతో ఆయా వార్డుల్లోని బాత్‌రూమ్, వాష్‌రూమ్‌లు తీవ్ర దుర్వాసన వెదజల్లుతున్నాయి. వాటిని వినియోగించకుండా తాళం వేయడంతో ఎక్కడికి వెల్లాలో తెలియక రోగులు పడుతున్న అవస్థలు వర్ణనాతీతం. రూ.20 పెట్టి లీటరు వ్యాటర్ బ్యాటిల్ కొని దాహార్తి తీర్చుకున్నా, ఇతర అవసరాలు ఎలా తీర్చుకోవాలో తెలియడంలేదని నిరుపేద రోగులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గాంధీఆస్పత్రి ప్రధాన భవనం ఎనిమిదవ అంతస్థులో నర్సింగ్ స్కూలు కొనసాగుతోంది.నీటి సరఫరా నిలిచిపోవడంతో నర్సింగ్ విద్యార్థులు తీవ్ర అవస్థలకు గురవుతున్నారు. బాత్‌రూమ్, వాష్‌రూమ్ అవసరాలు తీర్చుకునేందుకు గాంధీ మెడికల్ కాలేజీ ప్రాంగణంలో నూతనంగా నిర్మిస్తున్న భవన సముదాయం వద్దగల పవర్‌బోర్ నుంచి మంచినీటిని బకెట్లలో నింపుకుని ఎనిమిదవ అంతస్థుకు తీసుకువెల్తున్నారు. గత రెండున్నర నెలల క్రితం కూడ పంపుహౌజ్ లో విద్యుత్ సమస్య తలెత్తడంతో నీటి సరఫరా నిలిచిపోయింది. అప్పుడు అధికారులు లక్షలాది రూపాయలు వెచ్చించి కొత్త విద్యుత్ కేబుల్ లైన్లను ఏర్పాటుచేశారు. కొద్దిరోజులకే తిరిగి పంపు సెట్టు మోరాయించడం ఆసుపత్రి నిర్వహణ దుస్థితి తెలుపుతోంది. కాగా 24 గంటల తర్వాత రెండు పంపుసెట్ల సాయంతో నీటి సరఫరాను పునరుద్దరించినట్లు తెలిసింది.



## ఇంట్లో ఓట్లన్నీ ఒకే వార్డులో ఉంచుకోండి

**సవరణలకు సమయం ఇచ్చిన ఎన్నికల సంఘం**



**చేర్యాల, ఆగస్టు 29 (సిద్దిపేట పవర్)** ఒకే ఇంట్లో ఉన్న ఓట్లన్నీ ఇంతకుముందు వేరే వార్డులో ఉంటే ఇపుడు అవి ఒకే వార్డులో ఉంచుకోవడానికి ఎన్నికల సంఘం అవకాశం ఇచ్చింది అని బి.ఆర్.ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ బంగారీగల్ల కిరణ్ తెలిపారు..ఈ సందర్భంగా కిరణ్ మాట్లాడుతూ గ్రామం యొక్క కొత్త ఓటరు లిస్ట్ ను గ్రామ పంచాయతీ లో మరియు ఎంపిడిఓ ఆఫీస్ లో పొందుపరిచారని పౌరులు అందరూ తమ కుటుంబం ఓట్లు ఒకే వార్డులో ఉన్నాయో లేదో చూసుకోవాలని ఒక వేళ లేని యెడల, సరైన పత్రాలతో ఎంపిడిఓ ఆఫీసులో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు..